ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 11 ఏప్రిల్ 2024 | 5







ఇవే గుర్తుపెట్టుకోండి : గుర్తులను చూపుతున్న పవన్‌కల్యాణ్

వారాహికి.. జన హారతి

నిడదవోలు : పవన్‌కల్యాణ్‌కే కాదు.. పవన్‌కల్యాణ్ వాహనం వారాహికి విశేష స్పందనే.. నిడదవోలు గణేష్ చౌక్ సెంటర్‌లో బుధవారం జరుగుతున్న వారాహి విజయభేరి సభకు వచ్చిన వారాహి వాహనాన్ని తిలకించేందుకు అటు టీడీపీ, ఇటు జనసేన, బీజేపీ శ్రేణులు సాయంత్రం ఐదు గంటలకే పెద్దఎత్తున తరలివచ్చారు. తొలిసారి నిడదవోలు విచ్చేసిన వారాహి వాహనానికి అభిమానులు హారతులు పట్టారు. వారాహి వాహనం రాకతో నిడదవోలు గణేష్‌చౌక్ సెంటర్ అంతా సభ ప్రారంభానికి ముందుగానే జనసంద్రంగా మారింది.



జనసేనానులు

జనసేనలో చేరికలు





చంద్రబాబు..పవన్‌కు నీరాజనం

- నిడదవోలు సభకు పోటెత్తిన జనం
- 20 వేల మందిపైగా వచ్చారని అంచనా
- దద్దరిల్లిన సభా ప్రాంగణం

నిడదవోలు /ఉండ్రాజవరం, ఏప్రిల్ 10 : జనసేనానుల రాకతో ఎటు చూసినా జనం.. జనం.. నిడదవోలు ప్రజాగళం సభ దద్దరిల్లింది. వారాహి విజయభేరిగా ఈ సభ మార్మోగింది. తొలిసారిగా ఒకే వేదిక మీద ఎన్నికల సభలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కలిసి గర్జించడంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో భలే ఊపు వచ్చింది. నిడదవోలు పట్టణంలోని గణేష్‌చౌక్ సెంటర్ అంతా జనసంద్రంగా మారింది. సాయంత్రం ఐదు గంటల నుంచే పరిసర గ్రామాల నుంచి ప్రజలు ప్రజాగళం సభకు భారీగా తరలివచ్చారు. నాయకులు మాట్లాడుతున్నంతసేపు జైచంద్రబాబు, జైపవన్‌కల్యాణ్ అంటూ ప్రజలు ఆ పార్టీ జెండాలతో సందడి చేస్తూనే ఉన్నారు.ఈ జనాన్ని చూసి చంద్రబాబు మిమ్మల్ని చూస్తుంటే నాకు అర్థం అయిపోయింది. జగన్‌ను ఇంటికి పంపడానికి మీరు ఇప్పటికే నిర్ణయం చేశారు. మే 13 ఇక లాంఛనం మాత్రమే అనడం గమనార్హం. ఈ మూడు పార్టీలు ఎందుకు కలిశాయో పవన్‌కల్యాణ్ వివరించి చెప్పడం గమనార్హం. దుర్మార్గుడైన జగన్‌ను ఓడించడం కోసం, యువత ఉపాధి కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఐక్యమయ్యాయన్నారు. కూటమి అధికారంలోకి రాగానే సమస్యలను చకచకా పరిష్కరిస్తామన్నారు. ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి మాట్లాడుతూ ఎన్డీఏ విజయంతో రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పెద్ద మనస్సుతో ఇక్కడ జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్ పోటీచేయడానికి సహకరించినందుకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. నిడదవోలు చిన్న కాశీ రేవుకు వెళ్లే వంతెన నిర్మాణంతోపాటు వంద పడకల ఆసుపత్రి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డు సమస్యను పరిష్కారం చేస్తాం. గోదావరి జలాలను పట్టణ ప్రజలకు అందేలా చర్యలు చేపడతాం. ఇండోర్ స్టేడియం నిర్మిస్తాం. నిడదవోలు, సమిశ్రగూడెం మధ్యలో ఉన్న పురాతన హేవ్‌లాక్ బ్రిడ్జి స్థానంలో కొత్తది నిర్మిస్తాం. కంసాలిపాలెం -మాధవరం బ్రిడ్జిని పునరుద్ధరిస్తామని పవన్ చెప్పారు. నిడదవోలు మండలంలోని ఆంజనేయపురం, శింగవరంలో చంద్రబాబునాయుడు నిర్మించిన టిడ్కో ఇళ్లను కూటమి ప్రభుత్వం రాగానే లబ్ధిదారులకు అందిస్తాం. పెరవలిలో బస్టాండ్ నిర్మిస్తాం. పెరవలి ప్రభుత్వాసుపత్రిలో నేషనల్ హైవే వద్ద అడ్డుగా ఉన్న కటింగ్‌ను తొలగించి రోడ్డును అభివృద్ధిచేసి ప్రజలు, అరటి రైతులకు అనుకూలంగా మారుస్తాం. కానూరు-నడిపల్లి-తణుకు రోడ్డును ఆధునికీకరిస్తాం. ముక్కామల పెరవలి రహదారిని ఆధునికీకరిస్తాం. మల్లిపాలెం బ్రిడ్జిని విస్తరింపజేస్తాం. జగన్ పాలనలో నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. తమ కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల సమయంలోనే రోడ్ల నిర్మాణం చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. 3 నెలల్లో నియోజకవర్గంలో రహదారులను అభివృద్ధి పరుస్తామన్నారు.నిడదవోలు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వారాహి విజయభేరి సభలో వారాహి వాహనంపై రెండు సింహాలు నిలబడ్డాయన్నారు. ఓపక్క నారా వారి సింహం, మరోపక్క కొణిదెల వారి సింహం అప్రజాస్వామిక పరిపాలన చేస్తున్న వైసీపీని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి, ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా కందుల దుర్గేష్‌లను కమలం, గాజు గ్లాసు గుర్తులపై ఓటేసి ప్రజలు ఆశీస్సులు అందించాలన్నారు. నిడదవోలు వారాహి సభలో పట్టణ ప్రముఖ వైద్యులు. డాక్టర్ తోపరాల కళ్యాణచక్రవర్తికి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిడదవోలు పట్టణ వైసీపీ నాయకుడు గంటా శ్రీనివాస్, వైసీపీ మాజీ కౌన్సిలర్ గంటా నాగశాంతికుమారిలను పవన్ జనసేనలోకి ఆహ్వానించారు.

అడుగడుగునా అభిమానం

పశ్చిమగోదావరి జిల్లా తణుకులో రాత్రి 7 గంటలకు ప్రజాగళం సభ ముగించుకుని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రోడ్డు మార్గాన నిడదవోలు బహిరంగ సభకు బయలుదేరారు. తణుకులో రోడ్‌షో ముగిసిన తరువాత సుమారు 20 కిలోమీటర్లు ఒకే వాహనంపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు నిడదవోలు చేరుకున్నారు. సుమారు 8-43 గంటలకు నిడదవోలు సభావేదిక వద్దకు చేరుకున్నారు. వారాహి వాహనం ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. నిర్ణీత సమయానికంటే గంటకు పైగా అధినేతల రాక ఆలస్యమైనప్పటికి జనం ఉత్సాహంగా రాత్రి 10 గంటల వరకు అక్కడు ఉండడం గమనార్హం. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోకి వచ్చేసరికి వారికి ఇరుపార్టీల శ్రేణులు ఘనస్వాగతం పలికారు. పాలంగి, ఉండ్రాజవరం, మోర్త, దమ్మెన్ను, కానూరు, డి.ముప్పవరం మీదుగా నిడదవోలు వెళ్లారు. ఉండ్రాజవరంలో మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. నిడదవోలు రూరల్ మండలం మునిపల్లి గ్రామంలో మహిళలు నేతలిద్దరిపై పూలు జల్లారు. డి.ముప్పవరంలో కూడ ప్రజలకు అభివాదం చేస్తూ సుమారు 7.45 గంటలకు నిడదవోలు పట్టణంలో గణేష్‌చౌక్ సెంటర్‌లో ఉన్న వారాహి విజయభేరి సభకు చేరుకున్నారు. ఉండ్రాజవరం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మోటార్ సైకిళ్లపై కాన్వాయ్ వెంట వచ్చారు. ఒకే వాహనంపై రోడ్‌షో నిర్వహిస్తున్న చంద్రబాబు, పవన్‌లకు ప్రజలు విజయ సంకేతం చూపారు. 8.45 గంటలకు వారాహి వేదిక మీదకు వచ్చిన టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. 8.45 గంటలకు ప్రారంభమైన వారాహి విజయభేరి సభ 9.50 గంటలకు ముగిసింది. 20 వేల మందికిపైగా జనం రాకతో వారాహి విజయభేరి సభ విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కేఎస్ జవహర్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, నిడదవోలు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి భోగవల్లి ప్రసాద్, సుజయ కృష్ణరంగారావు, గన్ని వీరాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, పితాని సత్యనారాయణ, బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, బొమ్ముల దత్తు తదితరులు పాల్గొన్నారు.



మీకు మేమున్నాం : బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు



సభకు హాజరైన టీడీపీ నాయకులు



అభిమాన జెండా : జనసేన జెండాలతో పవన్ అభిమానులు



పవన్ అన్న వెంటే : పవన్ చిత్రాలతో యువత

నేడు అంబాజీపేట, అమలాపురంలలో
బాబు, పవన్ షో!

అమలాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రజాగళం పేరుతో గురువారం టీడీపీ,జనసేన అధినేతలు నారా చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ రోడ్ షో,బహిరంగ సభలు నిర్వహించనున్నారు.అధినేతల ఎన్నికల ప్రచార కార్యక్రమానికి అంబాజీపేట,అమలాపురం ప్రాంతాలు వేదిక కానున్నాయి. నిడదవోలులో బుధవారం రాత్రి బహిరంగ సభ అనంతరం తిరుమలసాయి కల్యాణమండపంలో బస చేస్తారు.ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకూ రంజాన్ వేడుకల్లో పాల్గొంటారు.1.30 గంటల వరకు పార్టీ నాయకులతో సమీక్ష, చేరికలు ఉంటాయి. అనంతరం 2.30 గంటల వరకూ గంట పాటు భోజన విరామం. పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 3 గంటలకు బ్రాహ్మణగూడెం నుంచి హెలికాఫ్టర్‌లో చంద్రబాబు బయలుదేరతారు. పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరంలోని హోటల్ షెల్టాన్ నుంచి బయలుదేరతారు. వీరిద్దరూ గురువారం మధ్యాహ్నానికి అంబాజీపేటలో వేర్వేరుగా ఏర్పాటుచేసిన హెలిపాడ్‌లకు చేరుకుంటారు. జనసేనకు పట్టున్న అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల్లో తొలి విడత పర్యటనలో భాగంగా ఇద్దరు నేతలు గురువారం పర్యటించి ఆయా పార్టీల కేడర్‌లో జోష్ నింపునున్నారు.ఈ సభలను విజయవంతం చేయాలని కోరుతూ ఏర్పాటుచేసిన ప్రచార రథాలను జనసేన నేత ఆకుల బుజ్జి ఆధ్వర్యంలో టీడీపీ అమలాపురం అభ్యర్థి ఆనందరావు ప్రారంభించారు. బుజ్జి ఆధ్వర్యంలో మోటారు సైకిల్ ర్యాలీ కూడా చేపట్టారు.ఎక్కడికక్కడే టీడీపీ, జనసేన నాయకులు గురువారం జరిగే ఉభయ నేతల సభకు భారీగా జనాన్ని తరలించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. అంబాజీపేటలో బహిరంగ సభ ముగిసిన తరువాత చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఒకే వాహనంలో అక్కడి నుంచి రోడ్ షో నిర్వహిస్తూ అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహించే సభాస్థలికి చేరుకుంటారు. సుమారు 6 కిలోమీటర్ల మేర జరిగే రోడ్ షోకి జనం భారీగా హాజరవుతారని అంచనా వేస్తున్నారు. అమలాపురం బహిరంగ సభ ముగిసిన తరువాత టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కిమ్స్‌లో నైట్‌హాల్ట్ చేస్తారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు చంద్రబాబు కిమ్స్‌లోనే ఉండి అమలాపురం లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్టీ పరిస్థితులపై జిల్లా నాయకులతో చర్చిస్తారని సమాచారం.



రాత్రి బస ఇక్కడే..

నిడదవోలులోని శ్రీ తిరుమల సాయి కళ్యాణ మండపంలో చంద్రబాబు బుధవారం రాత్రి బస చేశారు. గురువారం ఉదయం జిల్లా నేతలతో సమీక్షించి అంబేద్కర్ కోనసీమ జిల్లాకు వెళతా రు.జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కారులో బయలుదేరి రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో రాత్రి బస చేశారు.

పసుపు చంద్రయ్య



తెలుగుదేశం అంటే ప్రాణం. ఆనాడు అన్న ఎన్‌టీఆర్ నుంచి నేడు చంద్రబాబు వరకు ఎక్కడ టీడీపీ సభలు, సమావేశాలు జరిగినా అతను విధిగా హాజరవుతాడు.. అతని వస్త్రాలే కాదు.. బండి సైతం పసుపు మయం. చాగల్లు మండలం నందింగంపాడుకు చెందిన చిట్టూరి జలచంద్రయ్య బుధవారం నిడదవోలులో గణేష్‌చౌక్ సెంటర్‌లో జరుగుతున్న వారాహి విజయభేరి సభకు తాను మోటారుసైకిలును సైతం పసుపుమయం చేసుకుని జయహో చంద్రన్నా.... జయహో పవనన్నా.. అంటూ ఇలా సభకు తరలి వచ్చాడు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నివాస్

ఎన్నికల ప్రక్రియపై ప్రత్యేకంగా దృష్టి


కలెక్టర్ జె.నివాస్

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ నుంచి ఆయన క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 12 నుంచి జరిగే నియోజకవర్గ స్థాయి శిక్షణా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. మండల స్థాయి అధికారులు ఎన్నికల నియమావళిపై పట్టు సాధించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచి పనులు ఎక్కువగా చేపట్టాలని, మండల స్థాయిలో కొత్త పనులను గుర్తించాలన్నారు. ప్రధానంగా ఫారం పాండ్, అమృత సరోవర్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ వంటి పనులను గుర్తించి ప్రతిపాదించాలన్నారు. వేసవి తాపం ఎక్కువగా ఉన్నందున జిల్లాలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జలజీవన్ మిషన్ పనుల్లో పూర్తయిన ఆరు పనులకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటలక్ష్మి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క గింజ కొనలేదు!

- కొనుగోలు లక్ష్యం పండిన పంటలో 30 శాతమే
- దాళ్వాలో పండేది 6.87 లక్షల టన్నుల ధాన్యం
- కొనేది 1.92 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమేనట
- ధాన్యం కొనేవారు లేక రైతుల అగచాట్లు
- నామమాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

పిఠాపురం, ఏప్రిల్ 10: రైతులు పండించిన ప్రతి ధాన్యం కొనే బాధ్యత ప్రభుత్వానిదే. నాలుగున్నరేళ్లుగా ఇదే మాట చెప్పడం. పంట చేతికి వచ్చిన సమయానికి కొనేవారు లేక అయినకాడికి దళారులకు అమ్ముకోవడం షరా మామూలే. ధాన్యం సేకరణలో ప్రభుత్వం చెబుతున్న మాటలకు వాస్తవానికి పొంతన ఉండడం లేదు. ఇప్పుడు ఏకంగా ధాన్యం సేకరణ లక్ష్యాల్లోనే భారీగా కోత విధించింది. రైతులు పండించిన ధాన్యంలో కేవలం 30 శాతం లోపుగానే కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీచేశారు. ఆ మేరకైనా కొంటున్నారా అంటే ఇప్పటివరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఒక్క గింజ కొనుగోలు చేయలేదు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మాసూళ్లు ముమ్మరంగా సాగుతూ రైతులు పంటను మిల్లర్లకు అమ్ముకుంటున్నా అధికారులు మాత్రం ఇంకా పంట రైతుల చేతికి రాలేదని చెబుతున్నారు. జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో 1.63 లక్షల ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేశారు. రబీ సాగు ప్రారంభం నుంచి రైతులు అనేక ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్నారు. ఏలేరు, పీబీసీ ఆయకట్టుతోపాటు గోదావరి డెల్టా ప్రాంతంలోనూ వరి నారుమడులు, నాట్లు, పొట్టదశలోనూ సాగునీటి సమస్య ఏర్పడింది. పలుచోట్ల వరి పంట ఎండిపోవడంతో రైతులు ఆందోళనలకు దిగారు. కొన్నిచోట్ల పొలాలను దున్నేశారు. ఇన్ని ప్రతికూలతల మధ్య రైతులు దాళ్వా సాగు పూర్తి చేశారు. ఈ సీజన్‌లో రైతులు పండించిన పంట ద్వారా జిల్లాలో 6.87 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా. ఇందులో 6.50 లక్షల టన్నుల వరకూ రైతులు ధాన్యాన్ని మిల్లర్లకు లేదా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయిస్తారు. సాధారణంగా రైతులు పండించిన పంటలో ప్రభుత్వమే 75-85శాతం వరకూ సేకరించాలి. అందుకు విరుద్ధంగా ఈ సీజన్‌లో కేవలం 1.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. అంటే పండిన పంటలో కేవలం 30 శాతం లోపుగానే ప్రభుత్వం సేకరిస్తుంది. మిగిలిన పంటను రైతులు ఎలా విక్రయించుకోగలుగుతారు అన్న విషయంలో స్పష్టత కొరవడింది. జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో 214 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఈనెల 4న పెదపూడి మండలం గొల్లలమామిడాడలో జేసీ రామసుందర రెడ్డి ప్రారంభించారు. ఈరోజు నుంచి ఈ కేంద్రాల ద్వారా ఒక్క గింజను కూడా కొనుగోలు చేయలేదు. కేంద్రాలకు రైతులు వెళుతున్న తమకు ఇంకా ఆదేశాలు రాలేదని సిబ్బంది చెబుతున్నారు. ఈ కేంద్రాల ద్వారా ఏగ్రేడ్ (సూపర్‌ఫైన్) ధాన్యాన్ని 75 కిలోలను రూ.1,652కు, సాధారణ రకం రూ.1,637కు కొనుగోలు చేస్తారు. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనకపోవడం, కొనేందుకు పలురకాల నిబంధనలు చెబుతుండడంతో రైతులు మిల్లర్లు, దళారులను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి, పెదపూడి, కరప, కాజులూరు, తాళ్లరేవు, కాకినాడ రూరల్, సామర్లకోట తదితర ప్రాంతాల్లో 30 శాతం వరకూ కోతలు, మాసూళ్లు పూర్తయ్యాయి. రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లర్లు, దళారుల ద్వారా విక్రయించేస్తున్నారు. సన్నరకాలకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో రైతులు కూడా మిల్లర్లకు అమ్మేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. అత్యంత నాణ్యమయిన సన్నరకాలను మిషన్ కటింగ్ 75 కిలోల బస్తాను రూ.1600లకు, ఆరుదల రూ.1900వరకూ కొనుగోలు చేస్తుండగా, బీపీటీ సన్నరకాలను రూ.1500, 1800కు కొనుగోలు చేస్తున్నారు. ఇతర సాధారణ రకాలు, బొండాలును రూ.1350 నుంచి 1550 వరకూ మాత్రమే కొంటున్నట్టు చెబుతున్నారు. ఈ రకాలను ఆర్బీకేల్లో విక్రయిస్తే మద్దతు ధర వచ్చే అవకాశమున్నా, అయినకాడికి దళారులకే విక్రయించేస్తున్నారు. ధాన్యం విక్రయిస్తే నెలల తరబడి సొమ్ములు రాకపోవడంతో రైతులు ఆసక్తి చూపడం లేదు.



పిఠాపురం-గొల్లప్రోలు పట్టణాల మధ్య 216వ జాతీయ రహదారి చెంతనే ఆరబోసిన ధాన్యం

కోడ్ అమలుతో విస్తృతంగా దాడులు

రూ.4.4 కోట్ల నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు స్వాధీనం

సీ విజల్ యాప్‌లో ఫిర్యాదులతో క్షణాల్లో దాడులు

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్10: ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో జిల్లాలో దాడులు విస్తృతంగా జరుగుతున్నాయి. ఫ్లైయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వేలైన్ల బృందాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు జల్లెడ పడుతున్నాయి. జిల్లా నుంచి బయటకు వెళ్లే వాహనాలను, జిల్లాలోకి ప్రవేశించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. గత నెల 16వ తేదీ నుంచి ఇప్పటివరకు చేసిన దాడుల్లో జిల్లాలో రూ.4.4 కోట్ల విలువైన మద్యం, నగదు, వస్తువులను ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతిరోజు బృందాలు తనిఖీలు కొనసాగుతున్నాయి. సీ విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదుతో కేవలం కొన్ని నిమిషాల్లో బృందాలు చేరుకుంటున్నాయి. తనిఖీలు చేసి అక్రమంగా తరలిస్తున్న మద్యం, నగదును స్వాధీనం చేసుకుంటూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. అలాగే జిల్లాలో ఉన్న ఎనిమిది చెక్‌పోస్టుల్లో కూడా తనిఖీలు కొనసాగుతున్నాయి. చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటుచేసిన కెమేరాల ద్వారా జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లో అధికారులు తనిఖీలను పర్యవేక్షిస్తున్నారు.

తాయిలాలపై ప్రత్యేక నిఘా

ఎన్నికల్లో పంపిణీ చేసేందుకు అభ్యర్థుల అనుచరులు తరలిస్తున్న చీరలు, కుక్కర్లు, వెండి, బంగారం, ఇతర సామగ్రిపై బృందాలు ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించారు. వీటిని రాత్రి సమయంల్లో ఎక్కువగా రహస్యంగా ఒక ప్రాంతం నుంచి వేరొక ప్రాంతానికి తరలించడంతో దాడులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

రూ.4.4 కోట్లలో ఇలా..

మొత్తం స్వాధీనం చేసుకున్న రూ.4.4 కోట్లలో రూ.54 లక్షల 17 వేలు నగదు, రూ.1.13 కోట్ల విలువైన మద్యం, రూ.13.40 లక్షల విలువైన మాదక ద్రవ్యాలు, రూ.1.91 కోట్ల విలువైన వెండి, బంగారం, రూ.31.29 లక్షల విలువైన ప్రలోభ సామగ్రి ఉన్నట్టు కలెక్టర్ జె.నివాస్ వెల్లడించారు.

పోటాపోటీగా నాటిక ప్రదర్శనలు


చీకటి పువ్వు నాటికలోని ఓ సన్నివేశం

రావులపాలెం, ఏప్రిల్ 10: రావులపాలెం సీఆర్సీ కాటన్ కళా పరిషత్ వేదికపై రెండో రోజైన బుధవారం నాటిక పోటీలు పోటాపోటీగా సాగాయి. ప్రేక్షకులను ఆద్యంతం ఆకట్టుకున్నాయి. మొదటి నాటికగా చైతన్యకళాభారతి కరీంనగర్ వారి 'చీకటిపువ్వు' నాటికను ప్రదరించారు. రమేష్ మంచాల దర్శకత్వం వహించగా పరమత్ముని శివ రామ్ నాటకీకరణ చేశారు.. సురభి నాగరాజు సంగీతం, గానం అందించారు. ఆహార్యం, రంగాలంకరణ, లైటింగ్ వ్యవహారకర్తగా కేదారి నాగు ఉన్నారు. రెండో నాటికగా సిరిమువ్వ కల్చరల్స్ హైదరాబాద్ వారి 'థింక్‌ను ప్రదర్శించారు. మంజునాథ్ రచన, దర్శకత్వం వహించారు. సురభి నాగరాజు సంగీతం సమకూర్చారు. ఆహార్యం మల్లాది గోపాలకృష్ణ వ్యవహరించారు. మూడో నాటికగా మల్లాది క్రియేషన్స్ హైదరాబాద్ వారి 'చీకట్లో చంద్రుడు' అనే హాస్య నాటికను ప్రదర్శించారు. మల్లాది రవి కిరణ్, దర్శకుడిగా తేజోమూర్తుల మురళీధర్ వ్యవహరించారు. సంగీతం సురభి నాగరాజు అందించారు. ఆహార్యం బీవీ రావు వ్యవహరించారు. నాటికలన్ని ఆకట్టుకునే విధంగాను, సందేశాత్మకంగా ఉన్నాయి.

మే 19న సత్యదేవుని దివ్య కల్యాణం

- మే 18 నుంచి 24 వరకు కల్యాణోత్సవాలు
- గోటి తలంబ్రాల కార్యక్రమం రద్దు
- సమీక్షలో పలు నిర్ణయాలు తీసుకున్న అధికారులు


సమీక్ష నిర్వహిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, ఏప్రిల్ 10: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వార్షిక దివ్యకల్యాణోత్సవాల నిర్వహణపై బుధవారం ఈవో రామచంద్రమోహన్ అధ్యక్షతన వైదిక కమిటీ, అన్ని విభాగాల ఏఈవోలు, సూపరింటెండెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్రోధి నామ సంవత్సర స్వామి వారి దివ్య కల్యాణోత్సవాలు మే 18న వైశాఖ శుద్ధ దశమి రోజున స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలు చేయడంతో ప్రారంభమై 24న శ్రీపుష్పయాగంతో ముగుస్తాయి. 19న రాత్రి 9 గంటలకు అంగరంగ వైభవంగా దివ్య కల్యాణం నిర్వహిస్తారు. గతేడాది గోటి తలంబ్రాలుతో కల్యాణం అక్షింతలు తయారుచేయగా ఆ సంప్రదాయం అన్నవరం సత్యదేవుడికి లేనందున పూర్వపు పద్ధతిలో మామూలుగా కల్యాణ అక్షింతలు తయారుచేయాలని సుమారు 10వేల ప్యాకెట్లను సిద్ధం చేయాలని సూచించారు. అదే విధంగా గతేడాది స్వామి,అమ్మవార్ల శ్రీపుష్పయోగం ఆరుబయట వార్షిక కల్యాణవేదిక వద్ద చేపట్టడం దీనిపై విమర్శలు రావడం, పలువురు దీనిపై ఫిర్యాదులు చేయడంతో అనివేటి మండపంలో చేపట్టాలని నిర్ణయించారు. ఈ ఏడాది కల్యాణోత్సవాలకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయనాయకులకు ఆహ్వానాలు పంపకుండా దేవదాయ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను మాత్రమే ఆహ్వానించనున్నారు. కల్యాణోత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడికక్కడ క్యూలైన్‌లు పటిష్ఠపరిచి నిరంతరాయంగా తాగునీటి సరఫరా జరగాలని ఆదేశించారు. వైదిక కార్యక్రమాల నిర్వహణను వైదిక కమిటీ సంప్రదాయాలను గౌరవించి శాస్త్రోక్తంగా చేపట్టాలని దీనిని వైదిక కమిటీ సభ్యులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఆలయానికి రంగులు, విద్యుద్దీప అలంకరణల విషయంలో రాజీ పడొద్దని ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ విభాగ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా విభాగాల వారీగా కొన్ని లక్ష్యాలను నిర్దేశించారు. వచ్చేనెల మొదటి వారంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం అవుదాయని అప్పటికి నిర్దేశించిన లక్ష్యాలు 90శాతం వరకు పూర్తికావాలని ఆదేశించారు. స్వామివారి దివ్య కల్యాణోత్సవాలకు విస్తృత ప్రచారం కల్పించాలని పీఆర్వో కార్యాలయం దీనిని పర్యవేక్షించాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, పీఆర్వో దామెర కృష్ణారావు, ఏఈవోలు శ్రీనివాస్, జగ్గారావు, సూపరింటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, ఐ.వి రామారావు, పర్వత నరసింహారావు, అనకాపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన తరపున ప్రచారం చేస్తా

పలు ఆలయాల్లో పూజలు నిర్వహించిన హీరో నవదీప్


శ్రీపాద శ్రీవల్లభ సంస్థానంలో నవదీప్, హీరోయిన్స్

హీరో, హీరోయిన్లు పూజలు
లవ్ మౌళి ప్రేమ కథ చిత్రం హీరో నవదీప్ హీరోయిన్లు

పిఠాపురం, ఏప్రిల్ 10: పిఠాపురం అసెంబ్లీ నియోజవర్గం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కే తన మద్దతు అని, ఆయన తరపున ప్రచారం నిర్వహిస్తానని ప్రముఖ హీరో నవదీప్ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో లవ్ మౌళి ప్రేమ కథా చిత్రం యూనిట్ సభ్యులు బుధవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవదీప్ మీడియాతో మాట్లాడుతూ నిజాయితీగా ఎవరు పోటీ చేసినా ప్రజలు ఆదరిస్తారని చెప్పారు. పవన్‌కు తన మద్దతు ఎల్లప్పుడు ఉంటుందని, అవసరమయితే ప్రచారానికి వస్తానని తెలిపారు. శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం చాలా బాగుందని, స్వామిని ప్రత్యక్షంగా కళ్లతో చూసినట్లు ఉందని చెప్పారు. గతంలో తాను ఆలయాలకు వెళ్లేవాడిని కానని, ఇప్పుడు వెళుతున్నానని తెలిపారు. గిద్వాని, భావనలతో కలిసి మహాసంస్థానంలో పూజలు నిర్వహించారు. వారిని ఆలయ మర్యాదలతో అధికారులు సత్కరించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం నవదీప్ మాట్లాడుతూ ఈ సినిమాకు మూడేళ్లుగా ఎంతో కష్టపడి ఇష్టంతో పనిచేశానని తెలిపారు. సినిమా బాగా వచ్చిందని, ప్రేక్షకులు ఆదరిస్తారని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. ఈ నెల 19వ తేదీన సినిమా రిలీజ్ అవుతుందని తెలిపారు. ప్రేమికులకు ఇది గుర్తుండే ఒక కానుకగా ఉంటుందన్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల్లోని థియేటర్లలో ప్రదర్శిస్తూ ప్రేక్షకుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని చెప్పారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

జగ్గంపేట, ఏప్రిల్ 10: జగ్గంపేట మండలం రామవరం వద్ద బైక్ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. బుధవారం జాతీయ రహదారిపై వీర వెంకటరమణ తన భార్యతో బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో వీర వెంకటరమణకు తీవ్రగాయాలై మృతి చెందాడు. అతడి భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై జగ్గంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు స్వాధీనం

తాళ్లరేవు, ఏప్రిల్ 10: అమలాపురం నుంచి కారులో తుని ప్రాంతానికి తీసుకువెళుతున్న రూ.2,74,000ను పి.మల్లవరం చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ రామశేషయ్య ఆధ్వర్యంలో చెక్‌పోస్టు అధికారులు బుధవారం పట్టుకున్నారు. పట్టుకున్న నగదును సీజ్‌చేసి కోరంగ పోలీసు స్టేషన్‌కు స్వాధీనం చేశారు. ఈ నగదుకు సంబంధించిన ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో కోరంగి ఎస్‌ఐ ఎస్.రవికుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష


దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 10: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రావులపాలెం మండలం పొడగట్లపల్లికి చెందిన బడే రవికుమార్-రామసత్యవేణి దంపతులు రూ.లక్ష విరాళం సమర్పించారు. దాతలకు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా బుధవారం ఒక్కరోజు ఆదాయం రూ.2,02,021 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు



మాట్లాడుతున్న సీతారాం

పరిహారం ఇవ్వలేని
జగన్‌ను ఓడించాలి

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన

చింతూరు, ఏప్రిల్ 10 : పోలవరం పరిహారం, పునరావాసం కల్పించలేని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. చింతూరు మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పరిహారం పొందిన పోలవరం ముంపు భూములకు తాను అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి ఎకరాకు రూ. 5 లక్షల వంతున పరిహారం ఇస్తానని నమ్మబలికి చివరకు పునరావాసం కల్పించడంలో చేతులెత్తేసి కేంద్రం ఇస్తేనే తాను ఇవ్వగలనని చెప్పడం ముంపు వాసులందరూ వినే ఉంటారన్నారు. అటువంటి సీఎం మనకు అవసరమా అని ఆయన ప్రశ్నించారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో గొంతెత్తి ప్రశ్నించే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఆదివాసీల జీవితాలకు వెలుగునిచ్చే జీవో నంబరు 3 రద్దు విషయంలో కూడా సీఎం నోరు విప్పకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. నాయకులు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు వెంకట్, మొట్టుం రాజయ్య, మడకం చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షలు కడితేనే..మృతదేహం ఇస్తాం

- ఓ కార్పొరేట్ ఆస్పత్రి దాష్టీకం
- వైరల్ ఫీవర్‌తో బాధితుడి చేరిక
- రూ.7.50 లక్షల వరకూ ఖర్చు చేసిన కుటుంబం
- మంగళవారం రాత్రి మృతి
- మృతదేహం అప్పగించని ఆసుపత్రి
- మిగిలిన రూ.2 లక్షలు కట్టాలని డిమాండ్


ఆస్పత్రి ప్రతినిధుల వద్ద బాధితుల ఆవేదన


మృతదేహాన్ని ఉంచిన గది

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రి ప్రతినిధులు మానవత్వాన్ని మరిచి ప్రవర్తిస్తున్న తీరు దారుణాతిదారుణంగా ఉంది. వైద్యం కోసం వచ్చిన ఓ పేద వ్యక్తి మృతి చెందితే.. రూ.2 లక్షలు చెల్లిస్తేనే ఇస్తామంటూ మృతదేహాన్ని గదిలో పెట్టి తాళం వేయడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరవుతున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంతర్వేదికి చెందిన పాటి మోహన్‌రావు(58) వ్యవసాయం చేస్తుంటారు. ఆయనకు వైరల్ జ్వరం సోకడంతో గత నెల 23న కిమ్స్ (బొల్లినేని) హాస్పటల్‌కు తీసుకొచ్చారు. మూడు రోజులు ఐసీయూలో ఉంచి వైద్యం అందించారు. తర్వాత రూమ్‌కు మార్పు చేశారు. మళ్లీ పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్ పెట్టారు. కిడ్నీలు పని చేయడం లేదని డయాలసిస్ చేశారు. న్యూమోనియా తీవ్రంగా ఉందని చెప్పారు. ఈ క్రమంలో మోహన్‌రావు చనిపోయారని మంగళవారం రాత్రి 8గంటల ప్రాంతంలో కుటుంబీకులకు చెప్పారు. ఇంకా రూ.2 లక్షలు చెల్లిస్తే మృతదేహాన్ని అప్పగిస్తామన్నారు. అయితే అప్పటికే రూ.7.50లక్షల వరకూ చెల్లించామని.. ఇక తమ వద్ద డబ్బులు లేవని చెప్పడంతో వారితోనే ఫ్రీజర్ బాక్సు రప్పించి దానిలో మృతదేహాన్ని ఉంచారు. ఆ ఫ్రీజర్ బాక్సును ఓ గదిలో పెట్టి తాళం వేశారు. డబ్బులు కడితేనే మృతదేహం ఇస్తామని కరాఖండిగా చెప్పారు. దీంతో మృతదేహం ఇస్తే తీసుకెళ్తామని మంగళ వారం రాత్రి నుంచి ఆస్పత్రి వాళ్లను బాధితులు బతిమలాడుతూనే ఉన్నారు. అయినా ఫలితం లేకపోవడంతో బుధవారం రాత్రి కొంతమంది గురువారం వస్తామని వెనుతిరిగి స్వగ్రామానికి వెళ్లిపోయారు. అయితే గురువారం బాధితులు మృతదేహం కోసం ధర్నా చేసే అవకాశముందని సమాచారం.

● ఇదేమి ఆరోగ్యశ్రీ!

మోహన్‌రావుకు ఆరోగ్యశ్రీ కార్డు ఉంది. అయితే ఆయనకు ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయలేదు. ఆయన వ్యాధికి తమ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీలో వైద్యం చేయలేమని, ఆ వ్యాధికి ఆరోగ్యశ్రీ వర్తించే ఆస్పత్రిలో అయితే ఫలితం ఉంటుందని మెలిక పెట్టారు. ఆస్పత్రిలో చేర్పుకున్న నాటి నుంచీ రోజుకు సుమారు రూ.40 వేల వరకూ వైద్యానికి ఖర్చయింది. ఆ సొమ్ములు అప్పులు చేసి తెచ్చామని బాధితులు చెబుతున్నారు. తమ దగ్గర డబ్బులు లేవని, ఏదో రకంగా తమకు సహాయం చేయాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌కు బుధవారం రాత్రి బాధితులు ఫోన్ చేశారు. ఇప్పటి వరకూ కట్టిన సొమ్ములు ఇప్పిస్తే మంచిదని, లేకుంటే మృతదేహాన్ని అయినా అప్పగించాలని కోరారు. ఇంటి వద్ద మహిళలు రోదిస్తూ ఎదురు చూస్తున్నారని చెప్పారు. కానీ కోఆర్డినేటర్ నుంచి ప్రశ్నలు తప్ప ఫలితం లేకపోయింది. పోలీసులు సైతం ఏ సహాయమూ చేయలేమనడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అనుకుంటూ ఆస్పత్రి వద్దే బాధితులు విలపిస్తూ ఉన్నారు.

న్యాయం చేయండి : కిషోర్ కుమార్, కుమారుడు

మాది పేద కుటుంబం. మంచి వైద్యం అందుతుందని అప్పులు చేసి డబ్బులు చెల్లించినా ఫలితం లేకపోగా మృతదేహాన్ని ఇవ్వమంటున్నారు. రెండు రోజుల కిందట నుంచే పరిస్థితి విషమంగా ఉన్నా ఏదొకటి చేస్తూ నమ్మించారు. 30 గంటలు గడిచి పోయింది. మా నాన్నను కనీసం చూడనివ్వడం లేదు. ఆరోగ్యశ్రీ ఎందుకు పనిచేయదు. ఇది చాలా దారుణం. మాకు న్యాయం చేయాలి.

రామకృష్ణారెడ్డి కోసం నిరవధిక దీక్ష



అనపర్తి, ఏప్రిల్ 10: అనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ టిక్కెట్ కేటాయింపులో భాగంగా టీడీపీ తొలి జాబితాలో ప్రకటించిన విధంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరును అభ్యర్థిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బిక్కవోలు మండలం కొంకుదురు గ్రామశాఖ అధ్యక్షుడు కర్రి వీర వెంకట సత్యనారాయణరెడ్డి అలియాస్ కలెక్టర్ బుధవారం గ్రామంలోని తన నివా సంలో నిరవధిక దీక్ష చేపట్టారు. దివంగత మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి చిత్రపటం వద్ద ఆయన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 ఏళ్లుగా నల్లమిల్లి కుటుంబం టీడీపీకి సేవలందించిందని, అనపర్తిలో విజయావకాశాలు ఉన్న టీడీపీని కాదని బీజేపీకి మార్పు చేయడం సరికాదన్నారు. అనపర్తి సీటును నల్లమిల్లికి మార్పు చేస్తూ ప్రకటన చేసే వరకు దీక్షను విరమించబోమన్నారు.

'టీడీపీ కండువాతో ప్రచారం చేయొద్దు'

అనపర్తిలో బీజేపీ అభ్యర్థి ప్రచారంపై టీడీపీ నాయకుల అభ్యంతరం


అభ్యంతరం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

బిక్కవోలు, ఏప్రిల్ 10: అనపర్తి బీజేపీ అభ్యర్థిగా ప్రకటించిన ఎం.శివరామకృష్ణంరాజు బుధవారం బిక్కవోలు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అయితే ఆయన టీడీపీ కండువాలతో ప్రచారం ప్రారంభించడంతో పార్టీ గ్రామ అధ్యక్షుడు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి ఆధ్వర్యంలో నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తమ నేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని అనపర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారని, బీజేపీ నాయకులు రామకృష్ణంరాజును అభ్యర్థిగా ప్రకటించారని అయితే ఈ సీటుపై ఇంకా తర్జన భర్జనలు జరుగుతున్నాయని, అందువల్ల తమ పార్టీ కండువాలు కప్పుకుని ప్రచారం చేయవద్దని రాజుతో వాగ్వాదానికి దిగారు. రామకృష్ణారెడ్డి న్యాయం కోసం నల్లమిల్లికి అంటూ టీడీపీ కండువాలతోనే ప్రచారం చేస్తున్నారని, ఈ దశలో మీరు తమ పార్టీ కండువాలు కప్పుకుని ప్రచారం చేస్తే సహించబోమన్నారు. బీ-ఫారం ఎవరికి ఇస్తే అప్పుడు తామంతా వారి వెంటే ఉంటామన్నారు. దీంతో చేసేది లేక శివరామకృష్ణంరాజు కప్పుకున్న టీడీపీ కండువాను తీసి వేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుణ్ణం రమేష్, గొర్రెల త్రిమూర్తులు, రాయుడు రామచంద్రరావు, పెం టమాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని గద్దె దించడమే లక్ష్యం: శివరామకృష్ణంరాజు

వైసీపీ అరాచక పాలనను గద్దె దించడమే కూటమి లక్ష్యమని అనపర్తి బీజేపీ అభ్యర్థి ఎం.శివరామకృష్ణంరాజు తెలిపారు. బుధవారం ఆయన బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు జరిపి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి, కేంద్రంలో బీజేపీ విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట బీజేపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

భారీ చెప్పుల తయారీ


తయారు చేసిన భారీ చెప్పులతో చర్మకారుడు పెందుర్తి వెంకటేష్

మండపేట, ఏప్రిల్ 10: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన చర్మకారుడు పెందుర్తి వెంకటేష్ ఆరు అడుగుల ఎత్తు, మూడు అడుగుల వెడల్పుతో రెండు భారీ చెప్పులు తయారు చేశాడు. మండపేటలో ఒక చెప్పుల దుకాణం ప్రారంభించాలని నిర్ణయించిన ఒక వ్యక్తి ఇచ్చిన ఆర్డర్‌పై ఈ రెండు చెప్పులు తయారుచేసినట్టు వెంకటేష్ తెలిపాడు. షాపు ముందు డిస్‌ప్లే పెట్టడానికి ఈ చెప్పులు ఆ షాపు యజమాని తయారు చేయించాడు. రెండు చెప్పులు రెండు మోడల్స్‌లో తయారు చేసినట్టు వెంకటేష్ తెలిపాడు. ఒకటి వి టైపు, మరొకటి అత్తారింటికి దారేది సినిమాలో పవన్‌కల్యాణ్ వేసుకున్న మోడల్‌లో తయారు చేశాడు. ఈనెల రెండో తేదీ నుంచి వారం రోజులు రోజుకు మూడు గంటల చొప్పున శ్రమించి ఇద్దరి సహాయంతో ఈ చెప్పులు తయారుచేసినట్టు తెలిపాడు. చెప్పుల తయారీ కోసం రెక్సినా, పీఈఎల్ సోల్, లెదర్ వంటి మెటీరియల్‌ను ఉపయోగించినట్టు చెప్పాడు. ఒక్కో చెప్పు తయారు చేయడానికి రూ.5వేలు ఖర్చు అయిందన్నాడు. రాజారత్న సెంటరు సినిమా హాలు రోడ్డులో ఉన్న దుకాణం ముందు పెట్టిన అతిపెద్ద చెప్పులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

అప్పన్న చందనోత్సవం

చీఫ్ ఫెస్టివల్ అధికారిగా రామచంద్రమోహన్



అన్నవరం, ఏప్రిల్ 10: వచ్చేనెల 10న జరిగే సింహాచలం అప్పన్న చందనోత్సవానికి చీఫ్ ఫెస్టివల్ అధికారిగా అన్నవరం దేవస్థానం ఈవో కె.రామచంద్ర మోహన్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తరాంధ్ర, ఇతర ప్రాంతాల నుంచి సుమారు రెండు లక్షల మంది విచ్చేసే ఈ ఉత్సవానికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. గతేడాది చందనోత్సవానికి భక్తులు ఎన్నో ఇబ్బందులు పడి సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం కలగకుండానే వెనుతిరిగి వెళ్లిపోవడం, ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేయడం తెలిసిందే. ఈ ఏడాది దేవదాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో సింహాచలం ఈవోగా పనిచేసి అనుభవం ఉన్న రామచంద్రమోహన్‌కు ఈ ఏడాది చీఫ్ ఫెస్టివల్ అధికారి బాధ్యతలను అప్పగించారు.


రాజమహేంద్రవరంలోని పెద్ద మసీదు



రాజమహేంద్రవరంలో రంజాన్ సందడి నెలకొంది. అన్ని మసీదులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.. ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు..
● రాజమహేంద్రవరం సిటీ

కాగుతున్న కొండలు

గ్రామాలను కమ్మేస్తున్న పొగ





వై.రామవరం,ఏప్రిల్10: అల్లూరి జిల్లాలోని అటవీ ప్రాంతాల చుట్టూ గత వారం పదిరోజులుగా కొండలు తగలబడుతున్నాయి. ఆ పొగలు గ్రామాల్లోకి వ్యాపించడంతో మన్యం వాసులు ప్రతీరోజు తీవ్రమైన కళ్ల మంటలతో సతమతమవుతున్నారు. ఎండలు మండుతున్న వేళ కొండల్లో సంచరించే స్థానికులు నిప్పు పెట్టడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లుగా కొండల నుంచి కింద ఉన్న రహదారుల వరకు అగ్నిజ్వాలలు రగులుతున్నాయి. మొక్కలు, వివిధ రకాల పంటలు వేసుకుని జీవనాధారంగా బతుకుతున్న కొండపోడు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పలువురు ఆవేదన చెందుతున్నారు. అడవులను రక్షించండంటూ ప్రచారాల వరకే పరిమితమవుతున్న అటవీశాఖాధికారులు మంటలను అదుపు చేయడంలో చర్యలు తీసుకోవడం లేదని పలువురు గిరిజనులు ఆరోపిస్తున్నారు.

కాకినాడ



గండేపల్లిలో నిర్మానుష్యంగా రహదారి

భానుడి భగభగ

గండేపల్లి, ఏప్రిల్ 10: ఈనెల ప్రారంభం నుంచి ఉష్ణోగ్రతలు పెరగడంతో భానుడు భగభగలాడుతున్నాడు. ఎండల ధాటికి ప్రజలు బయటకు రావడంలేదు. మధ్నాహ్న సమయంలో వాహనరాకపోకలు లేకపోవడంతో గండేపల్లి మండలంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి.

'జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధం'

కరప, ఏప్రిల్ 10: వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాకినాడ రూరల్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పేర్కొన్నారు. కరప మండలం పెనుగుదురు బీసీపేటలో బుధవారం మాజీ సర్పంచ్ రెడ్డిపల్లి నారాయణరావు, మాజీ ఎంపీటీసీ తుమ్మలపల్లి మాచరరావుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం వైసీపీ నాయకులు కొప్పిశెట్టి శ్రీను, పెంకే మల్లేశ్వరరావు, కొప్పిశెట్టి భవన్నారాయణ, మేడిశెట్టి రమణ, నరాల వీరబాబు, చింతాకుల వెంకన్నబాబులు వారి అనుచరులతో కలిసి జనసేన, టీడీపీలలో చేరారు. జనసేన పార్టీ మండలాధ్యక్షుడు బండారు మురళి, బోగిరెడ్డి కొండలరావు, గంగాధర్, రెడ్డిపల్లి భాస్కర్, కోన అవినాష్, పబ్బినీడి వెంకట్రావు, మద్దూరి స్వామి, బండారు వెంకటేశ్వరరావు, గంటా మల్లేశ్వరస్వామి, కంటే సత్తిబాబు పాల్గొన్నారు.

'కూటమికి విజయం చేకూర్చాలి'

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 10: ఐదేళ్ల సీఎం జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అధోగతిపాలైందని, రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం టీడీపీ-జనసేన కూటమికి మద్దతు ఇచ్చి విజయం చేకూర్చాలని కాకినాడ రూరల్ జనసేన కూటమి అభ్యర్థి పంతం నానాజీ కోరారు. బుధవారం సర్పవరంలో కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు పుల్ల శ్రీను, పుల్ల శ్రీరాములు, పుల్ల వీరబాబు, కరెడ్ల గోవిందు, మాదారపు తాతాజీ ఉన్నారు.

'కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే రాష్ట్రాభివృద్ధి'

గండేపల్లి, ఏప్రిల్ 10: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే రాష్ట్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని నూతనంగా నియమితులైన జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. బుధవారం మల్లేపల్లి గ్రామంలో జనసేన నాయకులు బత్తుల వెంకట రమణ ఇంటి వద్ద నుంచి జనసైనికులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి బొదిరెడ్డి శ్రీనివాస్, మేకా వీరబాబు, ఉలిసి ఐరాజు, బోరా శివ, ఉంగరాల మణిరత్నం, దుర్గాప్రసాద్, మడిచే రామకృష్ణ, మెలికి గంగాధర్, రామదీపు ఉన్నారు.

'కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు పనిచేద్దాం'

తుని రూరల్, ఏప్రిల్ 10: కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సమన్వయంతో పనిచేద్దామని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు, తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు స్పష్టం చేశారు. స్థానిక సాయి వేదిక ఫంక్షన్‌హాల్లో తుని నియోజకవర్గానికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 15న తునిలో భారీ బైక్ ర్యాలీతోపాటుగా బహిరంగ సభ విజయవంతం చేసేందుకు నాయకులతో చర్చించారు. యనమల రాజేష్, నియోజకవర్గ జనసేన కో ఆర్డినేటర్ చోడిశెట్టి గణేష్, చింతమనీడి నాగ సోమరాజు, యినిగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, గాడి రాజబాబు, నారాయణాచార్యులు, మళ్ళ గణేష్, యనమల లక్ష్మణబాబు ఉన్నారు.

'పవన్ ఆశయాలను వివరిద్దాం'

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 10: ప్రతి ఓటరుని కలుసుకుని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలు, పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి ప్రకటించిన 14అంశాలతో కూడిన మేనిఫెస్టోను వివరిద్దామని జనసేన నాయకుడు, సాయిప్రియ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్ తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం దుర్గాడ పరిసర గ్రామాల పార్టీ నాయకులు, జనసైనికులతో సమావేశం నిర్వహించారు. గొల్లపల్లి శివబాబు, కందా శ్రీనివాస్, శాఖ సురేష్, కీర్తి చిన్నా, సఖినాల లచ్చబాబు, కోలా నాని పాల్గొన్నారు.

'నష్టపరిహారం అందించకపోవడం దారుణం'

ప్రత్తిపాడు, ఏప్రిల్ 10: 2023 డిసెంబర్‌లో వచ్చిన తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇప్పటి వరకు నష్టపరిహారం అందించకపోవడం దారుణమని భారతీయ కిసాన్ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమార స్వామి విమర్శించారు. ప్రత్తిపాడులో రైతుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతి రైతుకు రూ.2లక్షల వరకు రుణమాఫీ, ఎకరానికి రూ.5వేలు చొప్పున 5ఎకరాలు వరకు రూ.25వేలు పెట్టుబడి సహాయం చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన పార్టీలకే బీకేఎస్, రైతులు ఓట్లు వేస్తారని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యల్లపు సూర్యనారాయణ, బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా, బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షులు సింగిలిదేవ్ సత్తిరాజు పాల్గొన్నారు.

'ప్రజలకు న్యాయం చేస్తాం'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 10: దేశంలో వివిధ వర్గాల్లో ఉన్న ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పంచన్యాయాలతో వారికి న్యాయం చేయనున్నట్టు కాంగ్రెస్ కాకినాడ పార్లమెంటు అభ్యర్థి మల్లిపూడి మంగపతి పల్లంరాజు పేర్కొన్నారు. బుధవారం కాకినాడలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఐదు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. సమావేశంలో కాకినాడ పార్లమెంటు పరిధిలో పోటీ చేయనున్న కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థులు నీరుకొండ సత్యనారాయణ, మాదేపల్లి సత్యానందరావు, గేలం శ్రీనివాసరావు, చెక్కా నూకాజీబాబు, మారోతి శివగణేష్, తుమ్మల దొరబాబు, పిల్లి సత్యలక్ష్మీలు పాల్గొన్నారు.

ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 10: జగన్ వైసీపీ పాలనలో నిరుపేద బ్రాహ్మణులకు తీవ్ర అన్యాయం జరిగిందని, గత ప్రభుత్వ పాలనలో అమలు చేసిన స్కీములను అమలు చేయకుండా బోర్డును నిర్వీర్యం చేసినందుకు నిరసనగా ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవితో పాటూ వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు దినవహి పేర్రాజు (పేరుబాబు) ప్రకటించారు. బుధవారం వలసపాకల కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేసే పార్టీలకు తన మద్దతు ఉంటుందని, ఏపార్టీలో చేరేది త్వరలో తెలియ చేస్తానన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 10: కాకినాడ ఆర్టీసీ డిపోలో బుధవారం జిల్లా వైద్యశాఖ వారిచే ఓఆర్ఎస్ ప్యాకెట్లు డిపో సిబ్బందికి పంపిణీ చేశారు. జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు వేసవిలో సిబ్బంది తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. డిపో మేనేజర్ ఎంవి మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ప్రభాకరరావు, స్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడ ఆర్టీసీ డిపోలోని పార్శిల్ కార్యాలయంలో ఎవరూ తీసుకెళ్లని, గుర్తించబడని పార్శిళ్లకు ఈనెల 12న శుక్రవారం వేలంపాట వేయడం జరుగుతుందని అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారంతా పాల్గొనాలని కోరారు.

వసంత నవరాత్ర మహోత్సవాలు

సామర్లకోట, ఏప్రిల్ 10: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారి వసంత నవరాత్ర మహోత్సవాలు రెండోరోజు బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య(రాంబాబు), అంజిబాబు, సన్నిధిరాజు వెంకన్నబాబు, కొంతేటి భీమేశ్వరశర్మ, శ్రీనివాసరావు తదితరులచే నంది మండపం వద్ద విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన పూజలు నిర్వహించారు. స్వామివారికి పలు పూజలు, నీరాజనమంత్రపుష్పములు నిర్వహించారు. విశేష కుంకుమార్చన పూజల్లో కూరగాయల గొల్లబాబుఅనిత దంపతులు, కుసుమంచి శేషగిరిరావు పావని దంపతులు, కుసుమంచి శ్యామ్‌కుమార్‌హారిక దంపతులు ఆశీనులయ్యారు.

వేద పండితులకు ఉగాది పురస్కారాలు

పిఠాపురం, ఏప్రిల్ 10: శ్రీరామ హిందూ ఆధ్యాత్మిక సమాజ సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో వేదపండితులు, ఉపాధ్యాయులకు ఉగాది పురస్కారాలు అందించారు. పురస్కారాలు అందుకున్న వారిని సత్కరించి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు దివి సీతారాం, పుష్యమికీర్తి, విజయజనార్ధనాచార్యులు, ఈవో నున్న శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై నిరసన

శంఖవరం, ఏప్రిల్ 10: శంఖవరంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. బొమ్మిడి చిట్టిబాబు, బైరా సత్యనారాయణ, పిల్లా సూర్యనారాయణ, అడపా దొంగబాబు, దాసరి రాంబాబు చీపుర్లు పట్టుకుని వీధులు తుడిచి కాలువలు శుభ్రపరిచారు. వైసీపీ పాలనలో గ్రామాలు పూర్తిగా నాశనమయ్యాయన్నారు.

'పేదల సంపదను దోచుకున్న వైసీపీ'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 10: పేదల సంపదను దోచుకున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని కాకినాడ సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి వనమాడి కొండబాబు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన కాకినాడలో 30వ డివిజన్‌లో మెయిన్‌రోడ్డు, గోల్డ్‌మార్కెట్, మసీద్‌సెంటరులో పర్యటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లిపూడి వీరు, మాజీ మేయర్ సుంకర పావని తిరుమలకుమార్, గ్రంధి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో ప్రచారం నిర్వహిస్తున్న కొండబాబు

రాబోయేది టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వమే

» ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

» వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు





పెద్దాపురం: టీడీపీలో చేరినవారితో ఎమ్మెల్యే చినరాజప్ప, కిర్లంపూడి: టీడీపీలో చేరినవారితో నెహ్రూ

పెద్దాపురం, ఏప్రిల్ 10: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి వచ్చే ఎన్నికల్లో విజయం తథ్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని జె.తిమ్మాపురం, పెద్దాపురం పట్టణాల్లో బుధవారం నిర్వహించిన టీడీపీ చేరికలు కార్యక్రమాల్లో ఆయన పార్టీలో చేరినవారికి కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ రాబోయేది టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వమని, ఈ ఎన్నికల్లో వైసీపీకి గెలవలేమని భయం పట్టుకుందన్నారు. వైసీపీని ప్రజలు ఛీదరించుకుంటున్నారని, రాష్ట్రాన్ని అన్నివిధాలా భ్రష్టు పట్టించారన్నారు. టీడీపీ నేతలు నిమ్మకాయల రంగనాగ్, కందుల విశ్వేశ్వరరావు, రాజాసూరిబాబురాజు, తూతిక రాజు, కర్రి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సంకీర్ణ ప్రభుత్వ విజయానికి బాటలు

కిర్లంపూడి, ఏప్రిల్ 10: అభివృద్ధి, సంక్షేమం అందించే సంకీర్ణ ప్రభుత్వ విజయానికి బాటలు వేయాలని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని బూరుగుపూడిలో పాటంశెట్టి బాబ్జి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 150 కుటుంబాలు శిష్ట కరణములు టీడీపీలో చేరగా నెహ్రూ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, చదరం చంటిబాబు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పాటంశెట్టి మురళీకృష్ణ, అడబాల వెంకటేశ్వరరావు, నీలం శ్రీనివాస్, కుంచే తాతాజీ, పాటంశెట్టి రవి ఉన్నారు.

100 కుటుంబాలు చేరిక

ప్రత్తిపాడు, ఏప్రిల్ 10: ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన 100 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. ధర్మవరానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముదునూరి మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో వీరంతా టీడీపీలో చేరగా నియోజకవర్గ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో మండల పరిషత్ కో ఆప్షన్ మెంబర్ గొర్ల సత్యనారాయణ, రాయి సర్వారాయుడు, పెరికిరెడ్డి శ్రీను, సత్యంశెట్టి దొరబాబు, కోనేటి సత్యనారాయణ, కొల్లుబోయిన సూరిబాబు, తోపాటి సత్తిరాజు, రమణ, తలిశెట్టి రాజేష్, షేక్ నాగు, మద్దినాల గంగాధర్, స్వయంవరపు లక్ష్మణమూర్తి, అడపా సుబ్బారాయుడు పోకనాటి శ్రీను ఉన్నారు. ఆమెను రాష్ట్ర పెరికి సాధికారిక సంఘ అధ్యక్షుడు వనపర్తి బద్రి, జిల్లా సంఘ అధ్యక్షులు నర్సింగరావు, కార్యకర్తలు కలిసి సంఘీభావం తెలిపారు.

కొత్తపల్లి, ఏప్రిల్ 10: మండల కేంద్రమైన కొత్తపల్లి గ్రామ సర్పంచ్ భవానీ, మెంబర్లు లక్ష్మీ గోరే సహా 50మంది వైసీపీకి గుడ్‌బై చెప్పి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు. వర్మ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వర్మ మాట్లాడుతూ జగన్‌రెడ్డి తన పాలనలో గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. పంచాయతీ నిధులను దారి మళ్లించి సర్పంచ్‌లను అప్పులపాలు చేశారని మండిపడ్డారు. చంద్రబాబుతో పంచాయతీలకు న్యాయం జరుగుతుందని భావించి సర్పంచ్‌లు, వార్డు సభ్యులు టీడీపీలో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, గాది రాజబాబు, సూరాడ రాజు, వేమగిరి రాంబాబు,దూళ్ల సత్తిబాబు, కుక్కల రామకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీలోకి కొత్తపల్లి సర్పంచ్





కొత్తపల్లి: టీడీపీలోకి సర్పంచ్‌ను ఆహ్వానిస్తున్న వర్మ, ప్రత్తిపాడు: టీడీపీ కండువా కప్పుతున్న సత్యప్రభ

అనుమతులు లేకుండా అభివృద్ధి పనులు

పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదుతో కేసు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 10: అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను ఆపాలని కోరినా పట్టించుకోకుండా పనులు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.రాజేంద్రకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుర్గాడలో శ్మశానవాటిక నుంచి చెత్త సంపద కేంద్రం వరకూ, ఎస్సీ కాలనీ నుంచి ఆర్‌అండ్‌బీ రహదారి వరకూ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు ఈనెల 6న అరబిందో కంపెనీ ప్రతినిధులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అభ్యంతరం తెలపడంతో పనులు నిలిపివేశారని, తిరిగి 8న మెటల్ వేసి పనులు నిర్వహిస్తుండగా, పర్యవేక్షిస్తున్న మల్లాడి ఈశ్వర్‌కు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిలిపివేయాలని సూచించినట్టు కార్యదర్శి తెలిపారు. అయినా పట్టించుకోకుండా పనులు చేయడమే కాకుండా, పంచాయతీ రోడ్డును తవ్వేసి పాడు చేశారని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై బుధవారం రాత్రి గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

23,615 ఎకరాల్లో దాళ్వా వరికోతలు పూర్తి : డీఏవో

సామర్లకోట, ఏప్రిల్ 10: జిల్లాలో 22 మండలాల్లో ప్రస్తుత దాళ్వా వరిసీజన్‌కు గాను పంట పక్వదశకు చేరడంతో బుధవారం సాయంత్రం నాటికి 23వేల 615 ఎకరాల్లో పంటకోతలు పూర్తయ్యినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్‌కుమార్ వెల్లడించారు. బుధవారం రాత్రి సామర్లకోటలో విలేకరులతో డీఏవో మాట్లాడుతూ జిల్లాలో దాళ్వా సీజన్‌కు గాను 1.63 లక్షల ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. పంటపూర్తికాలానికి అవసరమగు నీటితడులు సకాలంలో అందేలా వ్యవసాయ, ఇరిగేషన్ శాఖలు క్షేత్రస్థాయిలో విశేష కృషిచేశారన్నారు. సీజన్‌లో చీడపీడలు అంతగా ఆశించకపోవడం, వాతావరణ పరిస్థితులు పూర్తి అనుకూలంగా ఉండడమే గాక జిల్లా వ్యవసాయయంత్రాంగం నిరంతరం రైతులకు అమూల్యసలహాలు అందించి పంట పెట్టుబడులు తగ్గించేలా కృషిచేయడంతో ఇప్పటివరకూ పంట కోతలు పూర్తయిన పొలాలలో ఎకరాకు 48 నుంచి 52 బస్తాల దిగుబడులైనట్టు రైతులుఇచ్చిన సమాచారంగా తెలుస్తుందన్నారు.

అమరావతి విజిలెన్స్ అధికారుల దర్యాప్తు పూర్తి

సామర్లకోట, ఏప్రిల్ 10: సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటుచేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ల వద్ద షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టుల భర్తీలో పెద్దఎత్తున ముడుపులు చేతులమారాయన్న ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందడంతో అమరావతి విజిలెన్స్ ఉన్నతాధికారుల బృందం బుధవారం జిల్లాకు చేరుకుని సమగ్ర దర్యాప్తు నిర్వహించి పలువురి నుంచి వాంగ్మూలాలను సేకరించారు. ఎస్ఈ కార్యాలయం సమీపాన నిర్వహించిన ఈ విచారణలో బాధితులు 19 మందిని రప్పించుకుని విడివిడిగా వాస్తవసమాచారాన్ని సేకరించారు. అలాగే కాకినాడ నగరపాలకసంస్థలో స్మార్ట్‌సిటీ విద్యుత్ పనుల్లో కూడా పలు అవకతవకలు జరిగాయని విజిలెన్స్ ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదుల మేరకు వాటిపై ఉన్నతాధికారులు దర్యాప్తులు నిర్వహించినట్టు తెలిసింది.

పాదయాత్ర భక్తులకు స్వాగతం

ఏలేశ్వరం, ఏప్రిల్ 10: ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామం నుంచి సుమారు 30మంది పాదయాత్రగా భద్రాచలం పయనమయ్యారు. బుధవారం వారికి ఏలేశ్వరం విశ్వహిందూ పరిషత్ సభ్యులు బాలాజీ చౌక్ సెంటర్‌లో స్వాగతం పలికి మజ్జిగ, పండ్లు, శీతల పానీయాలు అందజేశారు. కార్యక్రమంలో అలమండ వెంకట దుర్గాప్రసాద్, కటకం కిరీటి, గొల్లపూడి సత్యనారాయణ, గొల్లపల్లి త్రినాద్, గొల్లపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

కోటనందూరు, ఏప్రిల్ 10: ప్రశాంతంగా ప్రతి ఒక్కరు ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని సీఐ వివి ఎస్.మూర్తి, ఎస్ఐ శంకరరావు కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం అల్లిపూడి, చిన్నాయిపాలెంలో కేంద్రబలగాలతో పోలీసుల కవాతు నిర్వహించారు.



కేంద్ర బలగాలతో అల్లిపూడిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మహిళలు చైతన్యవంతులు కావాలి

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు



సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 10: విద్య, వైద్య, ఉద్యోగ వ్యాపార రంగాల్లో పురుషులతో సమానంగా దూసుకుపోతున్న మహిళలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు సూచించారు. పిఠాపురంలో నాగబాబును బుధవారం సాయంత్రం వీరమహిళలు కలిశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ వీరమహిళలు తలచుకుంటే వైసీపీని తుంగలోకి తొక్కవచ్చన్నారు. పవన్‌ను గెలిపించుకుంటే మీకు మీరు గెలిచినట్లేనని వాఖ్యానించారు. రానున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో మహిళలకు అత్యున్నత గౌరవం, రక్షణ పెంచే విధంగా చట్టాలు తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి గంటా స్వరూప, వీరమహిళల విభాగం ఉభయ గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ చల్లా లక్ష్మి, కడలి ఈశ్వరీ, తోలేటి శిరీష, .పిల్లా రమ్య జ్యోతి, కోలా దుర్గ, గౌరీ, కమల పాల్గొన్నారు. విరవ గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నేతలు నాగబాబు సమక్షంలో జనసేనలో చేరారు.

వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధుల వినతి

పిఠాపురం మండలం కుమారపురంలో గోకులం గ్రాండ్‌లో జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబును వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు కలిసి తమ సమస్యలను వివరించారు. రాష్ట్రంలో 40లక్షల మంది చేనేత కార్మికులు ఉంటే కేవలం 3.50లక్షల మందికి మాత్రమే నేతన్న నేస్తం అందిస్తున్నారని తెలిపారు. పవర్‌లూమ్ వ్యవస్థకు అనుగుణంగా ప్రభుత్వ విదానాలు ఉన్నాయని, చేనేత వస్త్రాల తయారీ ద్వారా రావాల్సిన సబ్సిడీ అందడం లేదని వివరించారు. రానున్న కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన అధికార ప్రతినిధి శరత్, ఆల్‌ఇండియా వీవర్స్ ఫెడరేషన్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పప్పు దుర్గారమేష్, కర్ర భక్త సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాధం సత్య పరదేశి, పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకుడు కోమాకుల సత్యనారాయణ, కరికాల భక్త సంక్షేమ సంఘం ప్రతినిధి జలదాని బాబి, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం నాయకులు ఇసుకపల్లి సత్యనారాయణ, జక్కిలింకి రమేష్, తంగెళ్ల శ్రీనివాస్, ఆల్ ఇండియా వీవర్స్ పెడరేషన్ ప్రతినిధి కొల్లి శివ నాగేశ్వరరావు తదితరులున్నారు.

మూడంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు : ఎస్పీ



భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జేఎన్‌టీయూకేలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో పాటూ మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశించారు. కాకినాడ పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 13న ఎన్నికలు ముగిసిన తర్వాత వివిధప్రాంతాల నుంచి స్ట్రాంగ్ రూమ్‌కి ఈవీఎం బాక్స్‌లను తీసుకువచ్చే బస్సులకు ఏ ట్రాఫిక్ అంతరాయం లేకుండా నేరుగా జేఎన్‌టీయూకేలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే ఇతర శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో త్వరితగతిన కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ చుట్టుపక్కల ప్రాంతాలు, ప్రధాన మార్గాలను పరిశీలించిన అనంతరం ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏఆర్ అదనపు ఎస్పీని ఆదేశించారు. బారికేడ్ల ఏర్పాటు, కేంద్ర సాయుధ దళాలు, ఇతర సాయుధ దళాల బలగాల పోలీసు సేవలను ఏవిధంగా ఉపయోగించుకోవాలి, బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. ఏఎస్పీ (అడ్మిన్) ఎంజేవీ భాస్కరరావు, ఏఎస్పీ (ఏఆర్) బి.సత్యనారాయణ, ఎస్‌డీపీవో కె.హనుమంతరావు, సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐలు చైతన్యకృష్ణ, రమేష్, టూటౌన్ సీఐ నాగేశ్వరరావు నాయక్ ఉన్నారు.

'కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధం'

సామర్లకోట, ఏప్రిల్ 10: రాష్ట్రంలో ఆరాచక వైసీపీ పాలనకు పూర్తిగా స్వస్తి పలికేందుకు, కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వెల్లడించారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడిగా తుమ్మల బాబును నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని చెప్పారు. బుధవారం రాత్రి ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలు నందు తుమ్మల బాబుకు కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ నేతృత్వంలో జనసేన పెద్దాపురం నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున అభినందన సత్కారం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజప్ప, తనయుడు రంగనాగ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజులతో బాబును గజమాలతో ఘనంగా సత్కరించారు. జనసేన, టీడీపీ నేతలు, కార్యకర్తలు అధికసంఖ్యలో బాబును పూలమాలలతో ముంచెత్తారు.

జయహో బీసీ కార్యక్రమాలు

గండేపల్లి, ఏప్రిల్ 10: వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలకు రావలసిన అన్ని పథకాలు రద్దు చేసి అణగదొక్కిందని టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు అన్నారు. ఆయన బుధవారం మల్లేపల్లి, ఉప్పలపాడు, గండేపల్లి, తాళ్ళూరు, సూరంపాలెం, నాయకంపల్లి గ్రామాల్లో జరిగిన జయహో బీసీ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీసీ సంఘం నాయకులు శీలామంతుల వీరబాబు, దుర్గాప్రసాద్ యాదవ్, బొండా శ్రీనుబాబు, చింతపల్లి భద్రరావు, దిడ్డి చిన్నశ్రీను, కొల్లి త్రిమూర్తులు, అప్పలరాజు, కనకరాజు, రాంబాబు, కాటేపల్లి భద్రం, తెలగారెడ్డి భద్రరావు, బొల్లంరెడ్డి రామకృష్ణ, వల్లభశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కిర్లంపూడి: కిర్లంపూడిలో ఎల్లపు దొరబాబు స్వగృహంలో జయహో బీసీ డిక్లరేషన్ క్లస్టర్ ఇన్‌చార్జి కుర్ల చినబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, కాళ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా జాస్తి వసంత్ విచ్చేశారు. గుడాల రాంబాబు, తూము కుమార్, ఎడ్ల కృష్ణ, ఆడారి నానాజీ, ఆళ్ల నానాజీ, కందా సత్యానందం, నంది బాలకృష్ణ, శరకణం వీరబాబు, రాయుడు పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట మండలం మామిడాడ గ్రామంలో ఇర్రిపాక, నరేంద్రపట్నం, బావారం, మామిడాడ గ్రామాలకు సంబంధించి టీడీపీ జయహో బీసీ సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అబ్జర్వర్‌గా జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సభ్యులు జంపన సీతారామచంద్రవర్మ ముఖ్య అతిథిగా, జగ్గంపేట కో ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ మాజీ చైర్మన్ జ్యోతుల మణి, జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత హాజరయ్యారు. జగ్గంపేటలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జగ్గంపేట చెందిన బీసీ కులస్తులు ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూను గెలిపించాలని జగ్గంపేట టీడీపీ ప్రెసిడెంట్ పాండురంగ రాంబాబు బీసీలను ఉద్దేశించి ప్రసంగించారు.

నేడు సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శన

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 10: పిఠాపురం మండలం మల్లాంలో గురువారం సాయంత్రం 6 గంటలకు అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘం శరణం గచ్ఛామి నృత్యరూప నాటక ప్రదర్శన ఉంటుందని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, అంబేడ్కర్ యువజన, వ్యవసాయ కూలీ సంఘం ప్రతినిధులు తెలిపారు. అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసే ప్రదర్శనను అందరు తిలకించాలని ప్రతినిధులు కూరాకుల సింహాచలం, డి.సూరిబాబు, జి.లోవబాబు, కృష్ణారావు, లచ్చబాబు, సత్తిబాబు, చిన్ని, లోవరాజులు కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కరప, ఏప్రిల్ 10: కరప విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ కాకినాడ డివిజన్ ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. కరప విద్యుత్ ఉపకేంద్రంతో పాటు 33కేవీ లైన్ మరమ్మతు పనుల నిమిత్తం కరప, పేపకాయలపాలెం, పెనుగుదురు, జడ్.బావారం, కొరుపల్లి, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, వలసపాకల, వేములవాడ, వాకాడ, పెదకొత్తూరు గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

12,13న ఎన్నికల అధికారులకు శిక్షణా తరగతులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 10: ఈ నెల 12,13న నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ బాధ్యులైన ఈవో, ఏపీవోలకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల సహాయ అధికారి, తహశీల్దార్ నరసింహారావు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన చర్యలను, ఇతర అంశాలు వివరించారు. సమావేశంలో ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ కె.శివప్రసాద్, ఎలక్షన్ డీటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు తాళ్లరేవులో దాట్ల ప్రచారం

తాళ్లరేవు, ఏప్రిల్ 10: తాళ్లరేవులో ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు తాళ్లరేవులో గురువారం ఉదయం ముత్యాలమ్మ గుడి వద్ద నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్టు టీడీపీ సీనియర్ నేత టేకుమూడి లక్ష్మణరావు బుధవారం తెలిపారు. మండలంలో టీడీపీ, జనసేన, బిజెపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

టోఫెల్ పరీక్షా విధానం పరిశీలన

పెద్దాపురం, ఏప్రిల్ 10: స్థానిక రాజీవ్‌గాంధీ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో టోఫెల్ పరీక్ష విధానం, అమలును సహిత విద్యా కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఎంఈవో ప్రభాకరశర్మ ఉన్నారు.

సామర్లకోట: సామర్లకోట మున్సిపల్ పాఠశాలలో టోఫెల్ పరీక్షలను ఎంఈవో పి.పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించగా విద్యాశాఖ సీఎంవో చామంతి నాగేశ్వరరావు సందర్శించారు. విద్యార్థుల నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్ పరిశీలించారు.

రైతు కుటుంబానికి ఆర్థికసాయం

వేములవాడ (కరప), ఏప్రిల్ 10: వేములవాడ సొసైటీ కార్యాలయంలో బుధవారం రైతు కుటుంబానికి రూ.2లక్షల ఆర్థికసాయమందించినట్టు సంఘ చైర్మన్ బండే పట్టాభిరామయ్య(తాతాజీ) తెలిపారు. సంఘ సభ్యుడు వి.సూరిబాబు ఇటీవలె పాముకాటుకు గురై మరణించగా ఇన్సూరెన్స్ కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును మృతుడి భార్య కృష్ణవేణికి అందజేశామన్నారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఉద్దండ సూర్యనారాయణ, సీఈవో నల్లా వెంకటేశ్వరరావు, శంకర్ ఉన్నారు.

వేగుళ్లమ్మకు ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 10: గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామదేవతగా విరాజిల్లుతున్న వేగుళ్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం సౌభాగ్య స్త్రీలచే లలితా సహస్రనామ కుంకుమార్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, ఆలయ సేవాసమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నూకాలమ్మ బద్దికడుగు ఉత్సవం

పెద్దాపురం, ఏప్రిల్ 10: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం బద్దికడుగు ఉత్సవం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో టీవీ సూర్యనారాయణ, దేవస్థానం చైర్మన్ గవరసాన వీరాస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది.